పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి

పెద్ద కొడప్‌గల్, జూలై 13: మండలంలోని బేగంపూర్ గ్రామ శివారులో శనివారం మండల వ్యవసాయాధికారి నదీమొద్దీన్ పంటలను పరిశీలించారు. గ్రామ రైతులు వ్యవసాయ భూముల్లో ఏఏ రకాల పంటలను సాగు చేశారనే విషయాలను పరిశీలించారు. దీంతో పాటుగానే రైతులు సాగు చేసిన పంటలు ఆన్‌లైన్‌లో గతంలోనే నమోదు చేయగా, ఆ పంటలను ఆన్‌లైన్‌లో నమోదు అయి ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. రైతులు పంటలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.



సాగు భూములకే.. భరోసా!

- జిల్లాలో లక్ష ఎకరాల వరకు సాగులో లేని భూములు
- సాగులో ఉన్న భూములు 5.20 లక్షల ఎకరాలు
- రియల్ వెంచర్‌లు, సాగులో లేని భూములు, గుట్టలకు బంద్
- రియల్ వెంచర్‌లు, గుట్టలకు జీపీఎస్ మార్కింగ్
- ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అధికారులు
- సాగు, భూ పరిమితులపై ఈనెల 18న రైతులతో సమావేశం
- హాజరుకానున్న మంత్రివర్గ ఉప సంఘం
- రైతులు, ఎంపీ, ఎమ్మెల్యేల అభిప్రాయ సేకరణ

కామారెడ్డి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతుబంధు గతంలో దుర్వినియోగానికి గురైంది. పలువురు తమ రియల్ వెంచర్‌లు, గుట్టలు, రోడ్లు, బంజరా భూములకు కూడా ఎకరానికి రూ.5వేల చొప్పున రైతుబంధు తీసుకున్నారు. తాజా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సాయాన్ని ఎకరానికి రూ.7500లు చేసింది. అమలు చేసే ముందు క్షేత్రస్థాయిలో పారదర్శకత ఉండేలా సాగులో ఉండే భూమికే ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేసింది. గత ఏడాది వర్షాకాలంలో సాగు చేసిన పంటలను ప్రామాణికంగా తీసుకుని సర్వే నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సర్వే ఆధారంగానే రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించనుంది. సాగులో ఉన్న భూములకే రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి జిల్లాల వారీగా మంత్రులు రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలను తీసుకుంటున్నారు.

లక్ష ఎకరాలు సాగులో లేని భూమి

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో సుమారు 9 లక్షల ఎకరాలకు పైగా వ్యవసాయ, రెవెన్యూ, అటవీ, ప్రభుత్వ పారిశ్రామిక తదితర భూములు ఉన్నాయి. ఇందులో సాగులో ఉన్న వ్యవసాయ భూమి 5.20 లక్షల ఎకరాల్లో ఉండగా సాగుకు అనుకూలంగా లేని భూములు లక్ష ఎకరాల వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే రైతుబంధు పేరిట సాగులో లేని భూములకు సైతం లబ్ధి చేకూరిందని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేయించింది. ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేశారు. అందులో గుట్టలు, కొండలు, రోడ్లు, బంజరు భూమి, రియల్ వెంచర్‌లు తదితర ఆప్షన్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో జిల్లాలో దాదాపు 12 వేల ఎకరాల భూమి సాగులో లేదని గుర్తించారు. అందులో అధిక శాతం రియల్ ఎస్టేట్ వెంచర్‌లు, కొండలు, బంజరు భూములు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో జీపీఎస్ ద్వారా మార్కింగ్ చేశారు. ఇక మీదట వీటిని వ్యవసాయ అధికారులు చూసినప్పుడు అది సాగు భూమా ఇతరత్రా అనేది స్పష్టంగా తెలుస్తోంది. సాగు భూమి అయితే రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

అనర్హుల ఏరివేతకు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రైతు భరోసా పథకం అమలుకు చర్యలు చేపడుతోంది. ఈ పథకంలో లబ్ధి పొందుతున్న అనర్హులను ఏరివేసేందుకు ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తుంది. పథకం అమలు చేసేందుకు 10 ఎకరాల వరకు పరిమితం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. కొండలు, గుట్టలు, బండరాయి భూములు, సాగుకు యోగ్యం కాని భూములను, ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం సేకరించిన భూములను, ప్రభుత్వ ఉద్యోగుల భూములను, రహదారులు, నాల కన్వర్షన్ లేకుండా వెంచర్‌లుగా మార్చిన భూములను పథకం నుంచి తొలగించనున్నారు. అదే విధంగా ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులతో రైతుభరోసా అందకుండా చేసేందుకు ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేస్తోంది. కౌలు రైతులు చేస్తున్న కౌలుకు చేస్తున్న భూముల యజమానులకు కాకుండా రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని సదరు రైతులకు కొంత, పట్టాదారులకు కొంత సాయాన్ని అందించే అవకాశాలు ఉన్నాయి. విధి విధానాలు ఖరారు అయిన తర్వాతే ఈ సీజన్ నుంచి కానీ వచ్చే యాసంగి నుంచి కాని పెట్టుబడి సాయాన్ని అందించే అవకాశాలు ఉన్నాయి.

18న మంత్రివర్గ ఉప సంఘం రాక

రైతు భరోసా అమలు చేసేందుకు ఈనెల 18న మంత్రి వర్గ ఉప సంఘం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, వ్యవసాయ అనుబంధ సొసైటీ ప్రతినిధులతో, రైతులతో మంత్రి వర్గ ఉప సంఘం భేటీ కానుంది. వీరి నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. పెట్టుబడి సాయం రూ.5 వేల నుంచి రూ.7500లకు పెంచుతున్న క్రమంలో సాగు పరిమితి, భూ పరిమితిపై అభిప్రాయాలు సేకరించనున్నారు. సాగు భూమికి ఎన్ని ఎకరాలకు సీలింగ్ విధించాలి, ఎంత భూమికి రైతు భరోసా చెల్లించాలి అనే విషయాలపై అభిప్రాయాలు తీసుకోనున్నారు. ఇందుకోసం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు జిల్లా వ్యవసాయ అధికారులు ఇప్పటికే ఆయా జిల్లా వ్యవసాయ భూముల పరిస్థితిపై నివేదికలు సిద్ధం చేశారు.

రైతుల అభిప్రాయాలు తీసుకుంటున్నాం

- భాగ్యలక్ష్మీ, జిల్లా వ్యవసాయాధికారి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా పథకంపై జిల్లాలో రైతుల అభిప్రాయ సేకరణ చేపడుతున్నాం. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకోవడం జరిగింది. ఈ నెల 18న మంత్రి వర్గ ఉప సంఘం ప్రజాప్రతినిధులతో, రైతులతో సమావేశం కానున్నారు. వీరితో పాటు వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరిస్తారు.

జిల్లాలో 2.83 కోట్ల చేప పిల్లల పంపిణీ

- ఈ నెలాఖరు వరకు పూర్తి కానున్న టెండర్లు
- వచ్చే నెలలో పంపిణీకి శ్రీకారం

ఎల్లారెడ్డి, జూలై 13: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లల పంపిణీపై నెలకొన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గల చెరువులు, కుంటలు రిజర్వాయర్లలో చేప పిల్లలు పోసేందుకు ఈ నెల 8న ప్రభుత్వం టెండర్లకు ఆహ్వానించింది. ఈనెల 23వ తేదీ వరకు టెండర్లను స్వీకరించనున్నారు. ఆ తరువాత టెండర్ల దాఖలు చేసిన కాంట్రాక్టర్లకు ఏ మేరకు అర్హతలు ఉన్నాయో సాంకేతిక కమిటీ పరిశీలించిన తరువాత తక్కువ కోట్ వేసిన కాంట్రాక్టర్లకు చేప పిల్లలు పంపిణీ చేసే టెండర్లను కట్టబెట్టనున్నారు. టెండర్ల ప్రక్రియ ఈనెల ఆఖరి వరకు పూర్తి అయితే ఆగస్టు నెల రెండో వారం నుంచి మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను పెంచి మత్స్యసంపదను గతంలో కంటే రెట్టింపు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు 2015 నుంచి మత్స్యకారులకు ఉచితంగా ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేయడం ప్రారంభించింది. గత ఏడాది నవంబరులో జరిగిన ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తారా లేదా అనుమానాలు మత్స్యకారులలో నెలకొన్నాయి. ఇటీవల ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించి మత్స్యకారులు నెలకొన్న అనుమానాలను పటాపంచలు చేసింది.



చేప పిల్లల పంపిణీ టెండర్లు ఆహ్వానించాం

- వరదారెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి

జిల్లాలో గల చెరువులు, కుంటలు రిజర్వాయర్లలో చేపలు పెంచి మత్స్యకారులు ఉపాధి పొందేందుకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేసేందుకు ఈనెల 8న టెండర్లను ఆహ్వానించారు. 23 వరకు గడువు విధించారు. అనంతరం సాంకేతిక కమిటీ పరిశీలించిన తరువాత నిర్ణయిస్తాం. ఆగస్టు రెండో వారంలో వర్షాలు పడి నీటి వనరులు నిండిన తరువాత మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేస్తాం.

2.83 కోట్ల చేప పిల్లల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా రెండు రిజర్వాయర్లు 710 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో ఈ సంవత్సరం 2.83 కోట్ల చేప పిల్లలను పెంచాలని ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో 272 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 226 పురుష మత్స్య సహకార సంఘాల ఉండగా, 46 మహిళా మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. సుమారు పది వేల మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. చెరువులు, కుంటలో వేసే చేప పిల్లలు 35 ఎంఎం, 35 నుంచి 40 ఎంఎం సైజ్ రిజర్వాయర్లలో వేసే చేప పిల్లలు 80 నుంచి 100 సైజుల్లో ఉంటాయి.

జిల్లావ్యాప్తంగా బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలి

ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సమాఖ్య చైర్మన్ యాదయ్య

కామారెడ్డి టౌన్, జూలై 13: జిల్లా వ్యాప్తంగా బదిలీ అయిన ఎస్జీటీలను ప్రత్యామ్నాయంతో నిమిత్తం లేకుండా రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ యాదయ్య అన్నారు. శనివారం దేవునిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని క్యాడర్‌లలో బదిలీలు, పదోన్నతులలో సాంకేతిక లోపం వల్ల నష్టపోయిన సీనియర్ ఉపాధ్యాయులకు స్లైడింగ్ అవకాశం ఇవ్వాలని తెలిపారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పీఎస్‌హెచ్ పోస్టులు మంజూరు చేసి అర్హులైన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని తెలిపారు. మిగిలిపోయిన ఎల్‌పీ-2, పీఈటీల అందరిని అప్‌గ్రేడ్ చేయాలని అన్నారు. ఎంఈవోలకు, 4, 5 మండలాల బాధ్యత ఉన్నందున పని భారం ఎక్కువ అవుతున్నందున ఆ మండలంలోని సీనియర్ (ఏజీహెచ్‌ఎం) ప్రధానోపాధ్యాయులకు ఎంఈవోల బాధ్యతలను కేటాయించాలని అన్నారు. ప్రతీ పాఠశాలలో స్కావెంజర్‌లను తక్షణమే నియమించాలని, వేసవి సెలవుల్లో ఏఏపీసీ పనులను పరిశీలించి పూర్తి చేయించిన పీఎస్, యూపీఎస్ హెచ్‌ఎంలకు ఈఎల్‌ఎస్ మంజూరు చేయాలని తెలిపారు. అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కో చైర్మన్ కుంట రాములు, బషీర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పంపరి ప్రవీణ్‌కుమార్, ముజిబొద్దీన్, కోశాధికారి బదావత్ దేవుల, సోషల్ మీడియా కార్యదర్శి అయ్యల సంతోష్, పందిరి రాజేష్, అకాడమిక్ కౌన్సిలర్‌లు శ్రీనివాస్, ప్రభాకర్, సలహాదారులు హనుమంత్‌రెడ్డి, విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో.. నీటి కటకట!

- డయాలసిస్ పరీక్షలకు అందని నీరు
- తీవ్ర ఇక్కట్లు పడుతున్న రోగులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారుల విఫలం
- ఉన్నతాధికారులైనా స్పందించేనా?

కామారెడ్డి టౌన్, జూలై 13: కామారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జీజీహెచ్)లో ప్రతీసారి నీటి కటకట ఏర్పడుతోంది. ఎన్నో ఏళ్లుగా నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆసుపత్రిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటీవల కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తన సొంత నిధులతో బోరు వేయించినా ఆ నీరు సైతం సరిపోవడం లేదు. వందల సంఖ్యలో ఇన్‌పేషంట్‌లు, వేల సంఖ్యలో ఔట్ పేషంట్‌లు ఉంటున్నా కనీస అవసరాలైన నీటిని సమకూర్చడంలో అధికారులు విఫలమవుతునే ఉన్నారు. ఆసుపత్రి అధికారులు నీటి సమస్యపై మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నా సమస్య మాత్రం తీరడం లేదు. పక్కనే గోదావరి నీటిలైన్ ఉందని దాని కనెక్షన్ ఇవ్వాలంటూ ఎన్నోసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ఎమ్మెల్యే సైతం మున్సిపల్ అధికారులకు నాలుగు ట్యాంకర్లను పంపాలని ఆదేశించారు. అప్పటి నుంచి నాలుగు నీటి ట్యాంకర్లను తరలిస్తున్నా నీరు ఏ మాత్రం సరిపోవడం లేదని వాదనలు ఆసుపత్రి వర్గాల నుంచి వినిపిస్తోంది. నీటి సమస్య ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న తదుపరి చర్యలు తీసుకునేలా ఏ మాత్రం దృష్టి సారించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డయాలసిస్ పరీక్షలకు అందని నీరు

కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ బాధితుల కోసం ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో పరీక్షల కోసం కావాల్సిన నీటికై నిత్యం తండ్లాట పడాల్సి వస్తోంది. నీరు సరఫరా లేకపోవడంతో గురువారం పలువురు కిడ్నీ బాధితుల బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. డయాలసిస్ చేయాలని సిబ్బందిని కోరిన ప్రతీసారి నీటి సమస్య ఉందనే కారణం చెబుతున్నారని వాస్తవానికి డయాలసిస్ సెంటర్‌లో నీటి సమస్య ఎప్పటి నుంచో ఉందని వారు సైతం ఆరోపిస్తున్నారు. డయాలసిస్ చేయకుంటే రోగులు ఇబ్బందులు పడుతారనే కనీస ఆలోచన కూడా అధికారులు చేయకపోవడం విడ్డూరంగా ఉందని వెంటనే ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి తగిన ఏర్పాట్లు చేయాలని విన్నవిస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారుల విఫలం

నీటి కటకటతో రోగులు, ఆసుపత్రి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో అధికారులు విఫలం అవుతునే ఉన్నారు. ఎన్నిసార్లు రోగుల బంధువులు నీటి సమస్యపై అధికారుల దృష్టికి తీసుకుపోయినా శాశ్వత పరిష్కారం చూపడం లేదనే వాదనలు వినిపిస్తు న్నాయి. మొత్తం ఆసుపత్రికి ఒకే ఒక బోరు ఉండడం అది కూడా సులబ్ కాంప్లెక్స్ వారు అందిస్తేనే ఆ నీటిని ప్రస్తుతం వినియోగిస్తుండడం గమనార్హం. తాగు నీటికి బాంబేక్లాత్ హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన నీటిని తీసుకొని రావడం, లేదంటే దుకాణంలో డబ్బులు చెల్లించి వాటర్ బాటిళ్లను కొనుకొని రావడం, కామారెడ్డి పట్టణానికి చెందిన రోగులైతే తాగడానికి, ఒంటికి, రెంటికి ఇంటి నుంచే తీసుకువస్తున్నారు. ఇక సిబ్బంది పరిస్థితి వర్ణణాతీతం వాష్‌రూమ్‌ను ఉపయోగించాలంటేనే జంకే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎక్కడ వాష్‌రూమ్‌ను వినియోగిస్తే నీరు రాకపోతే మా పరిస్థితి ఏంటని ఆలోచన చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో ఆసుపత్రిని పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి రోగులు నీటి సమస్యను తీర్చాలని విన్నవించడంతో మున్సిపల్ అధికారులకు మాట్లాడి ట్యాంకర్ల ద్వారా నీటిని ఏర్పాటు చేయించినా ఆ నీరు ఏ మాత్రం సరిపోలేదు. దీంతో తన సొంత నిధులతో ఆసుపత్రి ముందుభాగంలో బోరును సైతం వేయించారు. అందులో నీరు అంతంత మాత్రంగానే వస్తుండడంతో ప్రజలకు సరిపడా నీరు సమకూరడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రస్తుతం పంపిణీ చేస్తున్న నీటి ట్యాంకర్లతో పాటు మున్సిపల్ వాటర్ ట్యాప్ ఏర్పాటు చేసి నీటి కటకటకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కామారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి

వర్షాలు కురవాలని పూజలు

జక్రాన్‌పల్లి, జూలై13: పుష్కలంగా వర్షాలు కురువాలని శనివారం మండలంలో దేవునితోటలో వీడీసీ అధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి ఆల యంలో పూజలు చేశారు. వరుణదేవుడు కరుణించాలని పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ముప్కాల్, జూలై13: ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ సంగవి రాజు అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆశలతో పంపిస్తారని, తల్లిదండ్రుల ఆశయాలను వమ్ముచేయకూడదన్నారు. చిన్నస్థాయి నుంచే విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో పాటు విద్యను బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించడం వల్లే విద్యార్థులు ఎదిగి వివిధ రంగాల్లో స్థిరపడతారని, వారు చిన్ననాటి ఉపాధ్యాయులు బోధించినవి ఇప్పటి వరకు గుర్తుంచుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మురళీ, శ్రీవాస్తవ, విజయ్‌సారథి, సంపత్‌కుమార్, తోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మణ్, విజయకర్తన్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

బోధన్ రూరల్, జూలై 13 : బోధన్ పట్టణంతో పాటు ఎడపల్లి, బోధన్ మండలాల్లో ఉన్న సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏడీఈ బెనర్జీ తెలిపారు. ప్రతి నెల 2వ శనివారం సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులకు కలగకుండా నిరంతరం విద్యుత్ అందించాలన్న ఉద్దేశంతో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. రైతులు, ప్రజలకు విద్యుత్ సమస్య ఎదురైతే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. రైతులు, ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

పాఠశాల వద్ద ముళ్లపొదల తొలగింపు


ఏర్గట్లలో ముళ్ల పొదలను తీయిస్తున్న కౌన్సిల్ సభ్యులు

ఏర్గట్ల, జూలై 13 : మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల వద్ద శనివారం సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో ముళ్ల పొదలను తొలగించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులైన జిల్లా డైరెక్టర్ కట్కం శామంత్ రెడ్డి మాట్లాడతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ తమ దృష్టికి తీసుకురావడంతో స్థానిక పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ముళ్ల పొదలను తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఛైర్మన్ నరేష్, కార్య దర్శి జాకీర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

జన్నేపల్లి మాటు కాలువకు బుంగ

నవీపేట, జూలై 13 : జన్నేపల్లి మాటు కాలువకు ఇటీవల బుంగ పడిందని స్థానికులు తెలిపారు. స్థానిక జీరోపాయింట్ వద్ద మాటుకాలువ మధ్యలో బుంగపడడంతో నీరు వృథాగా వెళ్తుందని, దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని రైతులు పేర్కొన్నారు. మాటు కాలువ మధ్యలో పడిన బుంగను వెంటనే పూడ్చివేయాలని రైతులు కోరుతున్నారు.


బుంగ పడిన మాటుకాలువ

బ్యాంకు లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోస్రా, జూలై 13 : మండలంలోని చింతకుంట గ్రామంలో డ్వాక్రా మహిళా సంఘం చింతకుంట గ్రామ సంఘంలో వర్ని ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో సీఎఫ్ఎల్‌లు స్వాతి, అరుణ్‌కుమార్‌లు ఆర్థిక అక్షరాస్యతపై గ్రామ మహిళలకు అవగాహన కల్పించారు. బ్యాంకు లావాదేవీలపై అకౌంట్, ఏటీఎం, పీఎంజేబీవై వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏ హరీష, అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి శోభ, కోశాధికారి రాజశ్రీ, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్, జూలై 13 : మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల నర్సయ్య (36) జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. భూతగాదల విషయంలో అన్నదమ్ముళ్ళకు గొడవ జరుగగా తమ్ముడైన వరికుప్పల గంగాధర్ కట్టెతో తలపై కొట్టాడు. దీంతో కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం


నియామక పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఎడపల్లి, జూలై 13 : సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం చేస్తామని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా అధ్యక్షులు హన్మాగౌడ్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం ఎడపల్లి మండల సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షులుగా మంగల్‌పాటి లింగంకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ నుంచి అమలులోకి తెచ్చిన నూతన న్యాయచట్టాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ నారాయణ, జిల్లా అధ్యక్షులు రాజేందర్, జిల్లా ప్రధానకార్యదిర్శి ప్రసాద్, బోధన్ నియోకవర్గ ఛైర్మన్ జీవన్, గోపాల్ తదితరులున్నారు.

ఎస్సై మృతికి కారకులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

● అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు


మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

కమ్మర్‌పల్లి, జూలై 13 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న దళిత యువ ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి మండల అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి సంతాపంగా మౌనం పాటించి నివాళి అర్పించారు. మానసికంగా వేధించి మరణానికి కారుకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుంకరి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య, గుర్రం నరేష్, లెక్చరర్ సాయన్న, నరేందర్ కేకే, పాలెపు చిన్నగంగారాం, పత్రిరవి, బండి ఆంజనేయులు, బాబూరావు, సన్ని, శైలేందర్, దిలీప్, అనిల్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

నవీపేట, జూలై 13 : మండల కేంద్రంలోని తడగామకు చెందిన పింకు (29)అనే యువకుడు జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. పింకు అంత్యక్రియలను శనివారం నవీపేటలోని తడగామలో నిర్వహించారు. బాధిత కుటుంబం నిరుపేదకు చెందిన వారు కావడంతో 'మీ కోసం మేము' అనే సేవా సంస్థ ఆధ్వర్యంలో తొమ్మిది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, మోహన్, నవీన్‌రాజ్, మహిపాల్ తదితరులున్నారు.

సమన్వయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

● మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం


కోటగిరిలో మాట్లాడుతున్న మాజీస్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి, జూలై 13 : కాంగ్రెస్ పార్టీలో పని చేసిన నాయకులకు తగిన గుర్తింపును ఇస్తూ అందరి సమన్వయంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేస్తానని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం ఆయన పర్యటించారు. పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. గతంలో హెగ్డోలి శంకర్‌కు తగిన ప్రాధాన్యత కల్పించి ఎంపీపీ, జడ్పీటీసీగా, సర్పంచ్‌గా అవకాశం కల్పించామన్నారు. అనంతరం కోటగిరి మండల కేంద్రంలో జడ్పీటీసీ శంకర్ పటేల్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ సిరాజ్ పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. అనంతరం 91 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 22మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిని కలుపుకుని ముందుకు సాగుదామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ ఎలాంటి కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారంభాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు శంకర్ పటేల్, హెగ్డోలి శంకర్, నాయకులు ఏజాజ్ ఖాన్, షహీద్, మనోహర్, శాంతేశ్వర్ పటేల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ముప్కాల్, జూలై13: ముప్కాల్ మండల కేంద్రంతో పాటు వేంపల్లి, కొత్తపల్లి గ్రామాలలో బాధిత కుటుంబాలను శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ముప్కాల్ మండలానికి చెందిన బోట్లరవి ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ముత్యాల సునీల్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కొత్తపల్లి, వేంపల్లి గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, బద్దం సాగర్, జైడి సంద రవి, జక్క రాజేశ్వర్, జక్క గంగాధర్, కొమ్ముల శ్రీనివాస్, ఏలేటి విజయ్, మల్‌రెడ్డి, ముస్కు మోహన్, తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి


గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై యాసిర్‌అర్ఫాత్

● బాల్కొండ ఎస్సై యాసిర్ అర్ఫత్

ముప్కాల్, జూలై 13 : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావిత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ ఎస్సై యాసిర్ అర్ఫత్ సూచించారు. శనివారం మండలంలోని నాగాపూర్, బస్సాపూర్ గ్రామాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలను సారం ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల ప్రజలు నిర్లక్ష్యంగా ఉండవద్దని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీస్‌లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు

నవీపేట, జూలై 13 : మండలంలోని స్టేషన్ ఏరియాలో గల ఇరిగేషన్ కార్యాలయం స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని శనివారం అధికారులు కూల్చివేశారు. స్టేషన్ ఏరియాకు చెందిన అఫ్రోజ్‌ఖాన్ తన ఇంటి పక్కనే ఖాళీగా ఉన్న ఇరిగేషన్‌స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణంపై బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శనివారం తెల్లవారుజామున ఇరిగేషన్ డీఈ బలరాం, ఏఈ శ్రీధర్, ఎస్ఐ యాదగిరి గౌడ్, పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీల ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ బలరాం మాట్లాడుతూ మండలంలో ఇరిగేషన్‌కు సంబంధించిన కాలువలు, చెరువులకు చెందిన స్థలాలను పలు చోట్ల ఆక్రమణకు గురైనట్లు తమకు సమాచారం ఉందని, అటువంటి వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వస్థలాలను కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అక్రమ నిర్మాణం తొలగింపు సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


కూల్చివేసిన అక్రమ నిర్మాణం

కోటగిరిలో పీడీఎస్ బియ్యం పట్టివేత

కోటగిరి, జూలై13 : మండల కేంద్రంలోని బాలాజీ రైస్‌మిల్లులో శనివారం తెల్లవారుజామున పీడీఎస్ బియ్యాన్ని డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నిఖిల్‌రాజ్, ఎస్ఐ సందీప్‌లు కలిసి పట్టుకున్నారు. ఐచర్ వాహనంలో తీసుకువచ్చిన బియ్యాన్ని అన్‌లోడింగ్ చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. సుమారు 78.84క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. బియ్యం విలువ 1,25,360 రూపాయలు ఉంటుందన్నారు. మహారాష్ట్ర నుంచి ఐచర్ వాహనంలో పీడీఎస్ బియ్యం సరఫరా అవుతుందని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. వాహనం లోపలికి వెళ్లగానే అన్‌లోడింగ్ చేస్తుండగా కోటగిరి ఎస్ఐ సందీప్‌తో కలిసి డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పట్టుకున్నారు. అన్‌లోడింగ్ చేసిన బియ్యాన్ని తిరిగి లోడింగ్ చేసి ఇతర రైస్‌మిల్లుకు తరలించారు. వాహనాన్ని సీజ్ చేశారు. 61వేల క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యాన్ని తమ కస్టడీలోకి తీసుకుంటున్నామని డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెల్లడించారు.



బియ్యం వాహనాన్ని పట్టుకున్న అధికారులు

కొడుకుతో కలిసి తల్లి అదృశ్యం

బోధన్‌రూరల్,జూలై13: బోధన్ పట్టణంలోని రాకాసిపేట ప్రాంతానికి చెందిన బెలిడిగ మనీషా అనే మహిళ తన 3సంవత్సరాల కొడుకు గణేష్‌తో కలిసి శుక్రవారం వెళ్లి తిరిగి రాలేదని భర్త రమేష్ ఫిర్యాదులో పేర్కొనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. మనీషా తన కుమారుడితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద గాలించిన ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. అదృశ్యం అయిన మహిళ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

బోధన్‌కు చెందిన వ్యక్తికి వైద్యరత్న అవార్డు

బోధన్‌రూరల్,జూలై13: బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన డాక్టర్ అశోక్ సూర్యవంశీ అనే వ్యక్తి హైదరాబాద్‌లో సంజీవన్ నేత్రాలయ ఫౌండర్‌గా విశేష సేవలు అందించినందుకు గాను తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం కూరుగంటి కళాక్షేత్రంలో వైద్యరత్న అవార్డును అందజేశారు. వైద్యరత్న అవార్డును అందుకున్న డాక్టర్ సూర్యవంశీని శ్రీరామదాసు పదితరం వారసులు కంచర్ల శ్రీనివాస్ తదితరులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఎస్టీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

ఆర్మూర్‌టౌన్ , జూలై13: ఆర్మూర్ పట్టణంలో ఎస్టీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ అన్నారు. శనివారం పట్టణంలోని సంతోష్‌నగర్‌లో ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినిలు ఎస్టీ బాలికల హాస్టల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్‌చార్జీలు చెల్లించి నాణ్యమైన విద్యను అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, డివిజన్ కన్వీనర్ పల్లపు శ్రావణ్, వరప్రసాద్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ముప్కాల్, జూలై13: బాల్కొండకు చెందిన సల్లావుద్దీన్ అనే వ్యక్తి గత నెల పోగొట్టుకున్న ఫోన్‌ను శనివారం ఎస్సై యాసిర్ అరాఫత్ అందజేశారు. బాధితుడు గత నెల ఫోన్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాల్కొండ పోలీసులు సీఐఈఆర్ పోర్టల్ ద్వారా ట్రెస్ చేసి ఆచూకి తెలుసుకున్న అనంతరం తిరిగి ఫోన్‌ను బాధితుడికి ఎస్సై యాసిర్ అరాఫత్ అందజేశారు.

అర్హులందరికీ రుణాలు : ఐకేపీ డీపీఎం

డిచ్‌పల్లి, జూలై 13 : వ్యాపారం చేయాలకునే మహిళా అభ్యర్థులకు ఈడీపీ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి రుణాసదు పాయం కల్పిస్తామని ఐకేపీ డీపీఎం సాయిలు అన్నారు. శనివారం డిచ్‌పల్లి ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో ఈడీపీ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డీపీఎం సాయిలు మాట్లాడతూ.. మహిళా సంఘాలు స్కూల్ డ్రెస్సులు కుట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని, అన్ని మండలాల నుంచి స్కూల్ యూనిఫాంలు కుట్టి ఉపాధి పొందాలని ఆయన సూచించారు. ఈడీపీ శిక్షణ పూర్తిచే సుకున్న వారందరికీ ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు శిక్షణ ఎంతో దోహదం చేస్తుందని, ఇప్పటి వరకు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఆర్థికంగా స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో మహిళాసంఘాల ప్రతినిధులు రుణసదుపాయం కోసం అడగలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్, భాగ్యలక్ష్మీ, రామ్మకృష్ణ, రంజిత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో ఈడీపీ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జూలై 13 : మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు కొండపై చేరుకొని కొండపై చుట్టు భక్తులు కలిసి ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు

బోధన్‌రూరల్, జూలై 13 : బోధన్ పట్టణంలో రెండు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలకు ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం అందించి అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల క్రితం గుర్తుతెలియని అనాథ మృతదేహాలు లభ్యం కావడంతో ఎవరూ రాకపోవడంతో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో పోలీసు, మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో దహన సంస్కర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆర్యసమాజ్ ప్రతినిధులు ప్రదీప్‌గుప్తా తెలిపారు.

విద్యార్థులకు పంటల సాగుపై అవగాహన


వరినాటు విధానాన్ని పరిశీలిస్తున్న కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, జూలై 13 : పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులకు శనివారం పంటల సాగు, వరినాట్లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నర్సింగ్‌పల్లిలో ఇందూర్ తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన అనంతరం పంటల సాగువిధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వరినాట్లు వేయడం, కానుక పంటల తయారయ్యే విధానం, చెరుకు పంటసాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్‌మినాజ్, డైరెక్టర్‌లు నాగేశ్వర్‌రావు, విజయ్‌కర్తన్, మోసీన్‌చాబ్రి, తదితరులు పాల్గొన్నారు.

నాగంపేట్‌లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


నాగంపేట్‌లో ఇళ్లల్లో నిల్వనీటిని తొలగిస్తున్న సిబ్బంది

ముప్కాల్, జూలై 13 : మండలంలోని నాగంపేట్ గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం సుకన్య గ్రామంలో ఇంటింటికి వెళ్లి కులాయిల్లో, కూలర్‌లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. దోమలువృద్ధి చెంది లార్వ పెరుగుతుందని, ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు నిల్వ ఉన్న నీటి తొలగించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సెక్రెటరీ గౌతమి, ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆదివాసి నాయకపోడు కులస్తులు

ముప్కాల్, జూలై13: ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన సంగెం ముత్యం ఇటీవల 15 రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో కాలు విరిగింది. దీంతో ఆదివాసి నాయకపోడు కులస్తులు, ఉద్యోగ సంఘాల సభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగెం ముత్యంకు రూ.21వేల 500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసి నాయకపోడు జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, కార్యదర్శి సాయన్న, లోలం గంగాధర్, మెట్టు రాజేశ్వర్ పుట్ట రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌సీసీ క్యాడెట్లు



క్షత్రీయ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఆర్మూర్‌రూరల్, జూలై 13 : మండలంలోని చేపూర్‌లో గల ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ రహిత కళాశాలగా మార్చాలని, ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలు, క్యారీ బ్యాగులను తొలగించి కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ఎన్‌సీసీ ఇన్‌చార్జీ వెంకటేష్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

కోటగిరి, జూలై 13 : మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసే సమయంలో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. దోమల యొక్క లార్వాను చూపెడుతూ వాటి వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతినిత్యం శుభ్రమైన నీటిని సేవించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పొడి దుస్తులు వేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చర్మ సమస్యలు, దురదలు వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా కోటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహాల అధికారులు నరహరి, కల్పలత, సూపర్‌వైజర్ జ్యోతి, శ్రీదేవి, సంగీత తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి వసతి గృహంలో మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణ అధికారి

గ్రామాల్లో పని చేయని నిఘా నేత్రాలు

- అలంకార ప్రాయంగా మారిన సీసీ కెమెరాలు
- సరైన నిర్వహణ లేక పట్టించుకునే వారు కరువు
- ప్రజా సొమ్ము రూ.లక్షలు వెచ్చించినా ఫలితం శూన్యమే



నాగిరెడ్డిపేటలో పని చేయని సీసీ కెమెరాలు

నాగిరెడ్డిపేట, జూలై 13: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) పని చేయడం లేదు. దొంగతనాలు, నేరాలు జరుగకుండా వాటి నివారణ కోసం మండల కేంద్రంతో పాటు పెద్ద ఆత్మకూర్, చ జలాల్‌పూర్, పోచారం, తాండూర్ గ్రామాల్లో పోలీసుల సహకారంతో ప్రజలు స్వచ్ఛందంగా డబ్బులు జమ చేసి గత కొన్ని సంవత్సరాల క్రితం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు సమయంలో కొంత కాలం పాటు అవి బాగానే పని చేసినా ప్రస్తుతం చాలా గ్రామాల్లో అవి పని చేయడం లేదు. గ్రామాల్లోని నాయకులు, వ్యాపారస్తులు, ప్రజలు కలిసి గ్రామాల్లో దొంగతనాలు, నేరాలు జరుగకుండా ఉండేందు కోసం స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. సీసీ కెమెరాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి చెడిపోతే వాటి మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి పని చేయడం మానేశాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో దొంగతనం జరిగినా, ఏదైనా నేరం జరిగినా, ఘర్షణలు తలెత్తినా, ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామాల్లోకి వచ్చినా సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో దొంగతనానికి, నేరానికి గాకి పాల్పడిన వారు ఎవరూ అనే విషయం తెలియడం లేదు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ప్రస్తుతం సగానికి పైగా అవి పని చేయడం లేదు. ఇక మండలంలోని పెద్ద ఆత్మకూర్, జలాల్‌పూర్, తాండూర్, పోచారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు గత కొన్ని నెలలుగా అవి పని చేయడం లేదని ఆయా గ్రామస్తులు తెలిపారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నా పోలీసుల సహకారంతో గ్రామాల్లో గ్రామస్తులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నా అవి పని చేయకపోవడంతో గ్రామాల్లో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయని అవి ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదని పలువురు అంటున్నారు. గ్రామంలోని సీసీ కెమెరాలు సక్రమంగా పని చేస్తే, గ్రామంలో దొంగతనం కాని ఏ ఇతర నేరం జరిగినా, సీసీ కెమెరాల్లో రికార్డు అయితే నేరస్తులను సునాయాసంగా పోలీసులు పట్టుకునేందుకు వీలు కలుగుతుందని, కానీ లక్షల రూపాయలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంతో పాటు, మండలంలోని ఆయా గ్రామాలల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పని చేసే విధంగా చెడిపోయిన కెమెరాలను వెంటనే మరమ్మతులు చేసే విధంగా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణ సరిగ్గా లేక మరమ్మతులు జరుపక..

గ్రామాలల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ సరిగా లేకపోవడంతో, అవి చెడిపోతే వాటికి మరమ్మతులు చేసేందుకు ఎవరూ పట్టించుకోకపోవడంతో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీల వారు నిర్వహించేవారు. గ్రామ పంచాయతీలకు నిధుల కొరత ఉండటం, ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి కావడంతో సీసీ కెమెరాల మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

సీసీ కెమెరాలు పని చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కృషి చేయాలి

గ్రామాల్లో నేరాలు జరుగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలని ఏర్పాటు చేసుకోవాలని పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తుండగా, మండలంలో పోలీసుల సహాయ సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నా, గ్రామాల్లో అవి పాడైపోయి వాటికి మరమ్మతులు లేక నెలల తరబడి పని చేయకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేసే విధంగా కృషి చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్, జూలై 13: కామారెడ్డి పట్టణంలోని జేపీఎన్ రోడ్డులో శనివారం ఆటో యూనియన్ సభ్యులతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ సమావేశం నిర్వహించారు. మద్యం తాగి ఎవరు కూడా ఆటో నడపవద్దని, లైసెన్స్ ప్రతీ ఒక్కరికి ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

దోమకొండ, జూలై 13: ముదిరాజ్ కులస్థులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముదిరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరివి నర్సింలు అన్నారు. శనివారం దోమకొండలో హామీలను నెరవేర్చాలని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 15 నుంచి 20వరకు మండల రెవెన్యూ అధికారుల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి వినతిప్రతాలు సమర్పించు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చాలన్నారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి 75 శాతం సబ్సిడీతో వివిధ పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు అబ్రబోయిన రాజేందర్, సీతారాం మధు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

దోమకొండ, జూలై 13: మండలంలోని గొట్టిముక్కుల గ్రామ శివారులో శనివారం బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. రూ. 2 కోట్లతో దోమకొండ నుంచి గొట్టిముక్కుల, లక్ష్మీదేవునిపల్లి వరకు పనులు చేస్తున్నట్లు ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ తెలిపారు. దోమకొండ నుంచి బీటీ రోడ్డు కోతకు గురై, గుంతలు ఏర్పడి రోడ్డు పాడైనందున పాత రోడ్డును తొలగించి నూతనంగా దోమకొండ నుంచి లక్ష్మీదేవునిపల్లి వరకు సుమారు 6 కిలో మీటర్ల దూరం 2 ఫీట్ల ఎత్తుతో నాణ్యతగా కొత్త బీటీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు.



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

అధిక శబ్దాన్నిచ్చే సైలెన్సర్లను వాడొద్దు

కామారెడ్డి టౌన్, జూలై 13: అధిక శబ్దాన్నిచ్చే సైలెన్సర్లను వాడొద్దని డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద అధిక శబ్దం చేస్తున్న 60 ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు, మూడు నెలల నుంచి స్పెషల్ డ్రైవ్‌పెట్టి, సీజ్ చేసిన అధిక సైలెన్సర్‌లను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రాత్రిపూట అధిక శబ్దాలతో పలువురు యువకులు రోడ్లపై చక్కర్లు కొడుతున్నట్లు మా దృష్టిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌లు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ చాంపియన్‌కు ఎంపికైన క్రీడాకారులు

కామారెడ్డి రూరల్, జూలై 13: కేరళ రాష్ట్రంలో కోల్లాంలో జరిగే ఇండియా సబ్ జూనియర్ హాకీ సౌత్ జోన్ చాంపియన్‌షిప్‌కు నాలుగురు ఎంపికైనట్లు హాకీ ట్రెజరర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో కామారెడ్డి జిల్లా నుంచి పురుషుల విభాగంలో జె.దినేష్, పి.తులసి కుమార్ మహిళా విభాగంలో కె.వీణ, కె.భవాణి ఎంపికైన క్రీడాకారులను జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు నీలం లింగం అభినందించారు.

'హామీలను వెంటనే అమలు చేయాలి'

కామారెడ్డి రూరల్, జూలై 13: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కామారెడ్డి సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు మహిళలకు ఆర్థిక సహాయం, కౌలు రైతులకు సైతం రైతుభరోసా అందించాలని, ఇళ్ల స్థలాలు లేని వారందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మోతిరాంనాయక్, సురేష్ గోండ, ఎల్లన్న, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ వేధింపులు తాళలేక రికార్డు అసిస్టెంట్ ఆత్మహత్య

- ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ రికార్డు అసిస్టెంట్
- రామారెడ్డి మండలం కన్నాపూర్ శివారులో ఘటన
- మృతుడు కామారెడ్డి మండలం గుడెం వాసి

రామారెడ్డి, జూలై 13: డిప్యూటీ తహసీల్దార్ వేధింపులు తాళలేక రికార్డు అసిస్టెంట్ తెడ్డు ప్రశాంత్(28) సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామారెడ్డి మండలం కన్నాపూర్ శివారులో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకులు, ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం గుడెం గ్రామానికి చెందిన తెడ్డు ప్రశాంత్ తాడ్వాయి మండలంలోని తహసీల్దా ర్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే అదే కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్ అనవస రమైన పనులు చెబుతూ పని ఒత్తిడికి గురి చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడంటూ మృతుడు సూసైడ్ నోట్ రాసి కన్నాపూర్ శివారులోని అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులు, పోలీ సులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా స్థానికంగా సూసైడ్ నోట్ లభ్యమైంది. గత కొద్ది రోజులుగా మండల కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ తనను వేధిస్తున్నాడంటూ కుటుంబీకులతో సైతం తన ఆవేదనను చెప్పుకొచ్చినట్లు భార్య, కుటుంబీకులు తెలిపారు. తన భర్త ప్రశాంత్ చావుకు డిప్యూటీ తహసీల్దారే కారణమని భార్య లత పోలీసులకు ఫిర్యాదు చేసింది. భార్య ఫిర్యాదు మేరకు ఘటన స్థలంలో దొరికిన సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామారెడ్డి ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. అయితే ప్రశాంత్‌కు ఇద్దరు కూతుళ్లు ఆద్య, విధాత్రి ఉండగా ఇటీవల ఒక కూమారుడు జన్మించాడు. ప్రశాంత్ ఆత్మహత్యపై కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ రామన్‌లు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు.



ప్రశాంత్ (ఫైల్)

వర్షాలు కురవాలని హనుమాన్ ఆలయంలో పూజలు

పెద్ద కొడప్‌గల్, జూలై 13: వానా కాలం సీజన్ ప్రారంభం అయి నెల రోజులకు పైగా అయినా భారీ వర్షాలు కురియడం లేదని, మంచి వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని బేగంపూర్ గ్రామస్థులు హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ సరియైన వర్షాలు లేక పంటల సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. భారీగా వర్షాలు కురియకపోవడంతో చెరువులలోకి నీరు రాక ఆయకట్టు కింద పొలాలు నాట్లు వేయలేదని వాపోయారు. ఇకనైనా వరుణదేవుడు కరుణించి భారీగా వర్షాలు కురిపించాలంటూ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉదయం పూటే గ్రామస్థులు ఆలయానికి చేరుకుని పూజ చేయడంతో పాటు భజనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

'రేపు ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి'

బాన్సువాడ, జూలై 13 : ఈనెల 15వ తేదీన సోమవారం జరగబోయే బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం సభ కోసం ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పట్టణ శివారులోని ఎస్‌ఎంబీ ఫంక్షన్ హాల్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి బాన్సువాడ నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిగా కార్యకర్తలు తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా జరుగుతున్న ఏర్పాట్లలో పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ ప్రక్రియ పూర్తి

- 62 మందికి పదోన్నతి, 47 మంది బదిలీ

మద్నూర్, జూలై 13:ఉమ్మడి మద్నూర్ మండలంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయింది. ఏళ్లుగా ఎదురు చూసిన ఉపాధ్యాయుల పదోన్నతి పొంది ఆనందంతో కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. అదే విధంగా ఏళ్ళుగా ఒకే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారు. పదోన్నతులు, బదిలీల అనంతరం ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది. గత నెలలో ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పదోన్నతులు, బదిలీలపై కసరత్తు ప్రారంభించింది. టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయులకు పదోన్నతులు, అనంతరం బదిలీలు నిర్వహించారు. అందులో భాగంగానే ఉమ్మడి మద్నూర్ మండలంలోని పాఠశాలల్లో బదిలీ అయిన వారు పదోన్నతులు వచ్చిన వారు. తమకు కేటాయించిన స్థానాల్లో చేరారు.

ఉమ్మడి మద్నూర్ మండలంలో..

మద్నూర్, డోంగ్లీ మండలాల్లో 62 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు రావడం జరిగింది. వారిలో 14 మంది ఇతర మండలాలకు వెళ్లగా 48 మంది ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో బాధ్యతలు తీసుకున్నారు. అదే విధంగా 47 మంది ఉపాధ్యాయుల బదిలీలు కాగా 30 మంది ఉపాధ్యాయులు ఉమ్మడి మండలానికి వచ్చారు. ఉమ్మడి మండలంలో 34 ప్రైమరీ, 13 అప్పర్ ప్రైమరీ, 13 ఉన్నత పాఠశాలలో ఉండగా 298 మంది ఉపాధ్యాయులు అవసరం అన్నారు. ప్రస్తుతం 210 మంది మాత్రమే ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.



ఈత వనాలను నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

ఈత మొక్కలను నాటిన ఎక్సైజ్ అధికారులు

ఎల్లారెడ్డి, జూలై 13: మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో శనివారం వన మహోత్సవం సందర్భంగా ఎక్సైజ్ అధికారులు, కల్లుగీతా కార్మికులతో కలిసి ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటిన మొక్కలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ గంగాధర్, కానిస్టేబుళ్ల రవీందర్‌రెడ్డి, రంజిత్, స్రవంతి, కల్లు గీత కార్మికులు కొయ్యల విశాల్‌గౌడ్, బట్టి సాయాగౌడ్, రాజేందర్‌గౌడ్, బాలకిషన్, కొయ్యల రాజాగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

బీర్కూర్, జూలై 13 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి వారిని, అమ్మవార్లను భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి దర్శించుకున్నారు. స్వామి వారికి అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తిరుమలపూర్ గ్రామానికి చెందిన బాలాగౌడ్, మణెమ్మ దంపతులు అన్నదాన నిర్వహణ కోసం 15 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఆలయకమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రితో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, జూలై 13 : హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ కళాశాలలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన అధికారిక కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు. తెలంగాణలో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యపై చర్చ కార్యక్రమం హైదరాబాద్ నగరంలో జరగబోయే గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ సమ్మిట్ 2024లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సీఎంకలిసి లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

పెద్ద ఎక్లారా పాఠశాలలో చోరీ

మద్నూర్, జూలై 13:మండలంలోని పెద్ద ఎక్లారా ప్రభుత్వ పాఠశాలలో చోరీ జరిగినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఉమాకాంత్ మద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల తలుపులను పగుల గొట్టి దొంగతనం జరిగిందని, దొంగతనానికి పాల్పడిన వారు పాఠశాలలోని రెండు మానిటర్లను, రెండు రేడియోలను అపహరించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మద్నూర్ పోలీసులు శనివారం పాఠశాలకు వెళ్లి పరిశీలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

మహిళను వేధించిన వారిపై కేసు

ఎల్లారెడ్డి, జూలై 13 : ఓ వివాహిత మహిళను వేధించిన కేసులో భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జానకంపల్లి ఖుర్దు గ్రామానికి చెందిన వసంతను మెదక్ జిల్లా పాపన్నపేట మండలం చిత్రియల్ తండాకు చెందిన కాట్రోత్ దుర్గయ్యతో గత 12సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. అయితే గత సంవత్సరం కాలంగా తన భార్య వసంతను ప్రతీరోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడుతూ వేధిస్తున్నాడు. మద్యం మత్తులో తిడుతూ కొడుతున్నాడని వసంత అత్తమామలైన జాగ్యా, దుర్గిలు ఇద్దరు కూడా భర్తతో కలిసి వసంతను వేధిస్తున్నారు. ఈ విషయమై ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైలులో నుంచి పడి ఇద్దరు వ్యక్తుల మృతి




కామారెడ్డి టౌన్, జూలై 13: కదిలే రైలు లోంచి ఇద్దరు వ్యక్తులు పడి మృతి చెందినట్లు కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావునాయక్ తెలిపారు. శనివారం గుర్తు తెలియని ఇద్దరు పురుషులు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య గల వారు ఇందల్‌వాయి రైల్వేస్టేషన్ పరిధిలో రైలు లోంచి పడి చనిపోయారని తెలిపారు. ఎవరైన మృతుల ముఖాలను గుర్తిస్తే కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

బ్రెయిన్ ఫీవర్‌తో బ్యాంకు మేనేజర్ మృతి

బాన్సువాడ, జూలై 13: బ్రెయిన్ ఫీవర్‌తో బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన చండి ప్రియ(25) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చండిప్రియ గతంలో అన్నమయ్యపేట్ కోపరేటివ్ బ్యాంకు మేనేజర్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం గాంధారి కోపరేటివ్ బ్యాంకు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో చండిప్రియ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఐసీయూలో చేరడంతో శనివారం మధ్యాహ్నం బ్రెయిన్ ఫీవర్‌తో మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి మూడు నెలల బాలుడు, ఐదు సంవత్సరాల కూతురు, భర్త ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చండిప్రియ మరణించడంతో కోనాపూర్ గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.



చండిప్రియ (ఫైల్)

భిక్కనూరులో రెండు బైక్‌లు ఢీ : ఒకరి మృతి

భిక్కనూరు, జూలై 13: భిక్కనూరు శివారులోని ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. భిక్కనూరు ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన కూర్ల భూపాల్(48) ఎంఎస్ఎన్ కంపెనీలో పని చేస్తున్నాడు. రోజులాగానే శనివారం ఉదయం కంపెనీకి భిక్కనూరు మీదుగా బైక్‌పై వెళ్తుండగా పెద్దమల్లారెడ్డి వైపు నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై వెనకాల కూర్చున్న భూపాల్ తీవ్ర గాయాలతో మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరోవ్యక్తి సిదార్థ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



భూపాల్ (ఫైల్)

భాషా పండితులకు సరైన గౌరవం దక్కింది

- పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా

బాన్సువాడ టౌన్, జూలై 13: ప్రభుత్వం పండితుల దశాబ్దాల కలను సాకారం చేయడంతో భాషా పండితులకు సరైన గౌరవం దక్కిందని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా అన్నారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని సరస్వతీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భాషా పండితులకు పదోన్నతులు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. 2005 సంవత్సరం నుంచి భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించాలనే డిమాండ్‌తో ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. తాజాగా ప్రభుత్వం భాషా పండితులకు పదోన్నతి కల్పించడం ఆనందంగా ఉందని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ పెద్దలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కృష్ణ, కోశాధికారి శర్మ, రాష్ట్ర కార్యదర్శి మంత్రి మధుసూదన్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జమీలుల్లా, నార్ల అరుణ్, రజాక్, ప్రసాద్, శ్రీనివాస్, సాయిలు తదితరులున్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బదిలీ

పెద్ద కొడప్‌గల్, జూలై 13: గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న నళిని సుద్దపల్లికి బదిలీ అయ్యారు. గత ఆరు సంవత్సరాల కిందట పెద్ద కొడప్‌గల్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నళిని ఆరు సంవత్సరాల పాటు సేవలు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బదిలీలలో భాగంగా నళిని బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న నళినికి శనివారం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	భారతీయుడు-2
ప్రియా 70	కల్కి
ప్రియా 35	భారతీయుడు-2

బాన్సువాడ	
మహేశ్వరి	భారతీయుడు-2
వెంకటేశ్వర	మహారాజ

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

